వాన.. వరద

- రోడ్లపైకి నీరు.. మత్తడి దుంకిన చెరువులు
- జిల్లాలో 51.4 మిల్లీ మీటర్ల వర్షం..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరదలు పోటెత్తుతుండడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు మత్తడి దుంకాయి. కొన్నిచోట్ల రోడ్లపైకి నీరు రావడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

కరీంనగర్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలో సోమవారం ఉదయం నాటికి సగటున 51.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చిగురుమామిడి మండలంలో 83.0 గంగాధర మండలంలో 82.4 మిల్లీ మీటర్లు నమోదుకాగా రామడుగులో 58.2, చొప్పదండిలో 77.1, కరీంనగర్ రూరల్‌లో 38.8, కరీంనగర్/కొత్తపల్లిలో 35.8, గన్నేరువరం 52.4, మానకొండూర్‌లో 25.6, తిమ్మాపూర్‌లో 49.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కరీంనగర్ డివిజన్‌లో సగటున 55.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హుజూరాబాద్ డివిజన్‌లోని సైదాపూర్‌లో 42.2, శంకరపట్నంలో 58.2, వీణవంకలో 44.6, హుజూరాబాద్‌లో 39.2, జమ్మికుంటలో 48.6, ఇల్లందకుంటలో 35.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. డివిజన్‌లో సగటున 44.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది..

నగరపాలక సంస్థలో కాల్ సెంటర్ ఏర్పాటు

కార్పొరేషన్, సెప్టెంబర్ 2 : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ చాలా అప్రమత్తంగా ఉందని కమిషనర్ చాహత్ భాజ్ పాయ్ అన్నారు. సోమవారం 5,27 వ డివిజన్‌తో పాటు నగరంలో పలుచోట్ల పర్యటించారు. నగరపాలక సంస్థ చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, అధికారుల ఆదేశాల ప్రకారం నగరపాలక సంస్థ చాలా అప్రమత్తంగా ఉందన్నారు. వర్షాలకు నగర వ్యాప్తంగా ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు. వర్షాలతో ఎక్కడైన సమస్యలు తలెత్తితే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 9849906694, 0878-2237700కు సమాచారం అందించాలన్నారు. అలాగే దోమలు పెరగకుండా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామి, ఎస్ఐలు, జవానులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ : నగరంలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ భాజ్ పాయ్

కంట్రోల్ రూమ్‌కు 24 ఫిర్యాదులు

కలెక్టరేట్, సెప్టెంబర్ 2 : వర్ష బాధితుల కోసం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వివిధ సమస్యలపై సోమవారం సాయంత్రం వరకు 24 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఈ ఫిర్యాదుల్లో అధికంగా వరద తీవ్రతతో పడుతున్న ఇక్కట్లు తొలగించాలంటూ కోరుతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కాగా, కరీంనగర్ డివిజన్ పరిధిలో వర్ష ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఆర్డీవోకు కూడా సమాచారం అందిస్తే, వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు పడతామని ఆర్డీవో మహేశ్వర్ తెలిపారు.

మానకొండూర్, సెప్టెంబర్ 2 : వర్షాలతో మానకొండూర్ పెద్దచెరువులోకి వరదనీరు వచ్చి చేరడంతో నీటిమట్టం పెరుగుతున్నది. సోమవారం నుంచి పెద్దచెరువు మత్తడి పడుతుండగా, మత్స్యకారులు చేపలు పడుతున్నారు.

చిగురుమామిడి, సెప్టెంబర్ 2 : వర్షాలకు రేకొండ ఊర చెరువు మత్తడి దుంకుతున్నది. ముల్కనూరు, చిగురుమామిడి, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి గ్రామాల్లో చెరువులు మత్తడి దుంకడంతో మత్స్యకారులు చేపలు పట్టారు.

కరీంనగర్ రూరల్ : నగునూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న చెక్ డ్యామ్, వాగు

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 2 : దేవంపల్లిలోని పాల చెరువు, శ్రీనివాస్‌నగర్‌లోని బర్లాం చెరువు మత్తడి దుంకుతున్నాయి. వెల్ది-లింగాపూర్ మధ్య ఉన్న కల్వర్టు కుంగడంతో, ఈదులగట్టెపల్లి పంచాయతీ ఎదుట నీరు ప్రవహించడంతో రోడ్‌పై వెళ్లేందుకు జనం ఇబ్బంది పడ్డారు. కొండపల్కల-మద్దికుంట గ్రామాల మధ్య సైతం నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

అత్యవసరనిధి కింద ఆర్థిక సహాయం అందజేత

చొప్పదండి,సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు చొప్పదండి పట్టణ పిట్టల లక్ష్మి పెంకుటిల్లు కూలగా విపత్తు ఆర్థిక సహాయంగా రూ.3200, 25 కిలోల బియ్యాన్ని తహసీల్దార్ నవీన్ కుమార్ అందజేశారు. ఇక్కడ గిర్దావర్ నాగరాజు, రేషన్ డీలర్ రామ్మోహన్ ఉన్నారు.

గంగాధర, సెప్టెంబర్ 2: భారీ వర్షాలకు నారాయణపూర్ రిజర్వాయర్, గట్టుభూత్కూర్, సర్వారెడ్డిపల్లి, కురిక్యాల ఊర చెరువులు మత్తడి దుంకుతున్నాయి. సర్వారెడ్డిపల్లి చెరుకట్ట ప్రమాదకరంగా మారడంతో ఇరిగేషన్ శాఖాధికారులు పరిశీలించారు.

రామడుగు, సెప్టెంబర్ 2: వర్షాలతో రామడుగు సమీపంలోని మోతెవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పాత వంతెనకు ట్రాక్టర్‌ను అడ్డంపెట్టి రాకపోకలను నిలిపివేశారు. మోతె సమీపంలోని వంతెన పాక్షికంగా దెబ్బతిన్నది. విద్యానగర్‌లో మురుగు కాలువ మూసివేయడంతో వరదనీరు నివాస గృహాల్లోకి చేరి నిత్యావసర సరుకులు పాడయ్యాయి. ఇండ్లలోకి నీరుచేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

సైదాపూర్, సెప్టెంబర్ 2 : మండలంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు 42.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. వరద నీటితో చెరువులు మత్తడి దుంకుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వెన్కెపల్లి కారంకంటి రాజమ్మ ఇల్లు కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీణవంక, సెప్టెంబర్ 2 : వీణవంక, మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. మల్లారెడ్డిపల్లిలో నిమ్మల రాజయ్య ఇల్లు ఆదివారం రాత్రి కూలిపోగా ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. మామిడాలపల్లి శివారులో కల్వర్టు వద్ద తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. వీణవంక-నర్సింగాపూర్, కనపర్తి-వీణవంక, ఘన్ముక్ల-మల్లన్నపల్లి గ్రామాల మధ్య నీటి ప్రవాహానికి రాకపోకలు నిలిచిపోయాయి.

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలకు కరీంనగర్ మండలంలోని చామనపల్లి, చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్, జూబ్లీనగర్‌లో వందల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. చామనపల్లి, బహద్దూర్‌ఖాన్ పేటల మధ్య వాగు ఉధృతి రోడ్డు కల్వర్టు తెగిపోయి రెండు గ్రామాల మధ్య రవాణా నిలిచిపోయింది. పెద్ద చెరువు మత్తడితో చెర్లభూత్కూర్‌కు-ప్రశాంత్ నగర్ కాలనీ, గుజ్జుల పల్లికి రవాణా నిలిచిపోయింది. మానేరు వాగు, గుండి వాగుల ఉధృతితో మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్ గ్రామాలు, చామనపల్లి వాగుల పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. దాదాపు వందల ఎకరాల్లో పంటనీట మునిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగునూర్‌లో వల్లంపాడ్ వద్ద పోల్స్ విరిగి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వాగులో కొట్టుకుపోయింది. గోపాల్‌పూర్‌లో కేసీఆర్ భవన్ వైపు రహదారిపై నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గోపాల్‌పూర్ చెరువు, నగునూర్ చెక్ డ్యాం, దుర్గేడ్, గోపాల్‌పూర్ చెక్‌డ్యామ్‌లు మత్తడి దుంకుతున్నాయి. గర్రెపల్లి చెరువు ఉధృతంగా ప్రవహిస్తుంది.

గన్నేరువరం, సెప్టెంబర్ 2: మండలంలోని గుండ్లపల్లి దేవుని చెరువును జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించారు. ఇక్కడ ఆర్డీవో మహేశ్వర్, ఎఫ్ఏసీ నరసింహాచారి, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నేరువరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి పర్యటన

గన్నేరువరం, సెప్టెంబర్ 2: మండలంలోని గునుకుల కొండాపూర్, తుమ్మనిపల్లి, చీమలకుంటపల్లి గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లిసత్యనారాయణ పర్యటించారు. గునుకుల కొండాపూర్‌లో దళిత కాలనీలో దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీని పరిశీలించారు.

వంతెనను అందుబాటులోకి తెస్తాం : ఎమ్మెల్యే సత్యం

రామడుగు, సెప్టెంబర్ 2 : నేటి సాయంత్రంలోగా రామడుగు వాగుపై నిర్మించిన కొత్త వంతెనను మండల ప్రజలకు అందుబాటులోకి తెస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. వర్షాలతో రామడుగు పాత వంతెన పూర్తిగా దెబ్బతినడంతో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే దృష్టికి చేరాయి. సోమవారం సాయంత్రం అధికారులతో కలిసి వరద తాకిడికి దెబ్బతిన్న పాత వంతెనను పరిశీలించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, సీఐ ప్రకాశ్‌గౌడ్, విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎస్ఐలు కాంగ్రెస్ నాయకులున్నారు.

రామడుగు : మండల కేంద్రంలోని విద్యానగర్‌లో ఇంట్లోకి చేరిన వరదనీటిని ఎత్తిపోస్తున్న గ్రామస్తుడు

ప్రాజెక్టులకు భారీగా వరద

తిమ్మాపూర్, సెప్టెంబర్ 2 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పడతున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీగా వరద వస్తున్నది. గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎల్లంపల్లి బరాజ్‌కు పోటెత్తింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎల్లంపల్లికి ఎగువ నుంచి 2,92,815 క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం ప్రాజెక్టు 62 గేట్లలో 32 గేట్లను ఎత్తి 2,64,787 క్యూసెక్కులు దిగువన సరస్వతీ బరాజ్‌కు వదులుతున్నారు. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయానికి సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగుల నుంచి 36,320 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా 5వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 41,320 క్యూసెక్కుల వదర నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 27.5టీఎంసీల సామర్థ్యం ఉన్న మధ్యమానేరు ప్రస్తుతం 19.78 టీఎంసీల సామర్థ్యానికి చేరింది. కరీంనగర్ జిల్లాలో మోయతుమ్మెద వాగు, ఇతర వాగు, శ్రీరాజరాజేశ్వర జలాశయం ద్వారా మొత్తంగా 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎల్ఎండీ రిజర్వాయర్‌కు వస్తున్నది. 24 టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీలో ప్రస్తుతం 15.652 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయి.

నీటితో కళకళలాడుతున్న ఎల్ఎండీ రిజర్వాయర్

ఎస్సీ ఎస్టీ కోర్టు ఇన్చార్జి ఏపీపీగా రాములు

కోర్టుచౌరస్తా, సెప్టెంబర్ 2 : కరీంనగర్ ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆరెల్లి రాములును నియమిస్తూ తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరెల్లి రాములు ప్రస్తుతం కరీంనగర్ రెండో అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా పనిచేస్తున్నారు. దీంతో ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆయిల్ పామ్ తోటల సందర్శన

చిగురుమామిడి, సెప్టెంబర్ 2: ఉల్లంపల్లి గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను ఉద్యానవన డివిజన్ అధికారి మంజువాణి సోమవారం సందర్శించారు. అధిక వర్షాలపై జాగ్రత్తలను వివరించారు. అనంతరం గాగిరెడ్డిపల్లిలోని బొల్లోనిపల్లె, నవాబ్‌పేట్, చిగురుమామిడి కూరగాయల తోటలు సందర్శించి జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఇక్కడ ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ రైతులున్నారు.

వసతి గృహాల సందర్శన

శంకరపట్నం, సెప్టెంబర్ 2: మండలంలోని బాలురు, బాలికల వసతి గ్రుహాలను ఎంపీడీవో క్రిష్ణప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గొట్టె శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జ్వర పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కర్, సూపర్‌వైజర్ అనిల్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులకు ప్రణాళిక

తిమ్మాపూర్,సెప్టెంబర్2: మానకొండూర్ నియోజకవర్గానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.10కోట్ల నిధుల వినియోగానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేశారు. ఎస్సీకాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు సమగ్రప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో పీఆర్ డీఈ రవిప్రసాద్, మంజుభార్గవి, ఏఈలు సురేందర్‌రెడ్డి, వెంకన్న, మల్లేశం, స్నేహజ్యోతి, సమ్మయ్య, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గుట్టల పరిశీలన

సైదాపూర్, సెప్టెంబర్ 2 : మండలంలోని సర్వాయి పాపన్న గుట్టలను టూరిజం శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. సర్వాయిపేటలో పాపన్న కోట, బురుజు, గుట్టలను చూశారు. ఇక్కడ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్‌రెడ్డి, డీఎ ఫయాజ్ అలీ, తహసీల్దార్ మంజుల, తదితరులున్నారు.

దివ్యాంగుల పెన్షన్లు పెంచాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 2 :అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెన్షన్లు పెంచాలని, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని జ్యోతినగర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీ అమలు చేయటంలేదని విమర్శించారు. హామీలను అమలు చేయకపోతే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోగా, అధ్యక్షుడిగా మనోహరస్వామి, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా భాస్కరయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో 200 మందికి పైగా దివ్యాంగులు హాజరయ్యారు.

ఆస్తుల పంపిణీ తర్వాతే ఎన్నికలు జరపాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 2 : కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం గొర్ల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ కూడా విభజించిన నేపథ్యంలో, ఉమ్మడి జిల్లాలోని సంఘ ఆస్తులు, అప్పులు పంపిణీ చేసిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యనిర్వహణాధికారి డా.లింగారెడ్డికి సోమవారం ఎన్నికల నిర్వహణపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, లిఖితపూర్వకంగా అందజేశారు. ఇక్కడ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, సలేంద్ర రాములు యాదవ్, నాయకులు పర్స సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీపీ విద్యార్థులకు వీడ్కోలు

కొత్తపల్లి, సెప్టెంబర్ 2 : ఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాల 2022-24 బ్యాచ్ విద్యార్థులకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంబీఎ విద్యార్థులకు వీడ్కోలు, సిగ్నేచర్ డే కార్యక్రమం ద్వితీయ సంవత్సర విద్యార్థులు నిర్వహించారు. కోర్సు పూర్తయిన విద్యార్థులు వారి జ్ఞాపకాలు, అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ ఖ్వాజా మొయినొద్దీన్ ఉన్నారు.

నగర పాలక కార్యాలయం ఎదుట ఐద్వా ధర్నా

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 2: మహిళా గ్రూప్ డబ్బులను దుర్వినియోగం చేసిన ఆర్పీ లమీద చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో సోమవారం నగర పాలక కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఆర్పీల నుంచి రూ.12లక్షలా 50వేలను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. డబ్బుల దుర్వినియోగంలో గ్రూప్ సభ్యులకు సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కోనేటి నాగమణి, శ్రీలత, జ్యోతి పాల్గొన్నారు.

ఒక ఇంట్లో ఓటర్లను ఒకే బూత్‌లో చేర్చండి

శంకరపట్నం, సెప్టెంబర్ 2: ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యులను ఒకే బూత్‌లో ఓటర్లుగా చేర్చాలని ఎంపీడీవో గోల్కొండ క్రిష్ణప్రసాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఓటరు జాబితా సవరణల విధి విధానాలపై బీఎల్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాలను సవరించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీవో ప్రభాకర్, గిర్దావర్ ప్రత్యూష, తదితరులున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 2: గొర్రెల కాపరుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృతి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ డి మాండ్ చేశారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఇక్కడ నాయకులు బుచ్చన్నయాదవ్, ప్రసాద్ యాదవ్, జంగా కొమురయ్య యాదవ్, లింగయ్యయాదవ్ ఉన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ లక్ష్యం

రాంనగర్, సెప్టెంబర్ 2 : మహిళలు, యువతులు ఆకతాయిల వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీం లేదా ఉమెన్ పోలీస్ స్టేషన్ పోలీసులను సంప్రదించవచ్చని కరీంనగర్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తెలిపారు. కరీంనగర్ భగత్ నగర్‌లోని బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో సోమవారం షీ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఉమెన్ పోలీస్ స్టేషన్, షీ టీమ్స్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ, కమిషనరేట్ వ్యాప్తంగా మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు తెలంగాణ రాష్ట్ర పోలీసులు ప్రవేశపెట్టిన టీ సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని మీ ప్రయాణంలో భరోసానిస్తుందని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 2 : విద్యార్థులకు, నిరుద్యోగులకు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో సెప్టెంబర్ 5న పోటీ పరీక్షలపై ప్రముఖ విద్యావేత్త విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

ముగిసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక

గన్నేరువరం, సెప్టెంబర్ 2 : ఉపాధి హామీ పథకంలో ఏడాదిగా గన్నేరువరం మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై మూడో విడుత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం డీఆర్డీవో శ్రీధర్ ఆధ్వర్యంలో గన్నేరువరంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలకు నీటి సరఫరా, నాటిన మొక్కలకు, గుంతలకు తేడాలు ఉండడం, కూలీలకు చెల్లింపుల్లో తేడాలు ఉన్నట్టు గుర్తించి రూ.4,59,849 నిధుల వినియోగానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు,జాతీయ గ్రామీణ ఉపాధి సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీవీవో వెంకట్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎస్జీసీఓ శ్రీనివాస్, ఎస్ఆర్పీ సురేందర్‌బాబు, ఏపీవో స్వాతి, డీటీ కళావతి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన దుద్దనపల్లి వాసులు

సైదాపూర్, సెప్టెంబర్2 : మండలంలోని దుద్దనపల్లి గ్రామానికి చెందిన ఎస్సీకాలనీ వాసులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్‌లో కలిశారు. దుద్దనపల్లి ఎస్సీకాలనీలో మిడ్‌మానేరు కుడికాలువ వల్ల తమ ఇండ్లు ముంపునకు గురవుతున్నాయని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు విద్యుత్ ఎస్సీ,ఎస్టీ జేఏసీ ఉద్యోగులు

శంకరపట్నం, సెప్టెంబర్ 2: కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ కొనసాగింపు డిమాండ్‌తో తెలంగాణ విద్యుత్ ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆ సంఘం హుజూరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు రవి మాట్లాడుతూ, ప్రభుత్వం డైరెక్టుగా అపాయింట్ అయిన జేఎల్ఎం, ఏఈ, జేఏసీవో, జేపీఏ ఉద్యోగుల మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ విధానం, ఏఎల్ఎం, ఏడీఈ, ఏఎవో, తదితర ఉద్యోగుల పదోన్నతి తరువాత కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ కొనసాగించాలని కోరారు. ఈ నెల 2 నుంచి 20 వరకు విడుతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇక్కడ సంఘం డివిజన్ జాయింట్ సెక్రెటరీ భూక్యా రమేశ్ నాయక్, ఏఎల్ఎంలు ఆదిబాబు, జాల రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

మహేందర్ వైద్య చికిత్సకు రూ.50వేల వితరణ

కొత్తపల్లి, ఆగస్టు 2 : విష జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో వైద్య చికిత్స పొందుతున్న ఒక దినపత్రిక రిపోర్టర్ సిలివేరి మహేందర్ వైద్య చికిత్సల కోసం అల్పోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వీ నరేందర్‌రెడ్డి రూ.50వేలను వితరణగా అందజేశారు. మహేందర్ విషయం తెలుసుకున్న ఆయన సోమవారం సాయంత్రం జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డికి రూ.50వేల చెక్కును అందించారు.

చెక్కును ఒలింపిక్ సంఘం ప్రతినిధులకు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

ట్రెక్కింగ్ సెలక్షన్స్‌లో సెయింట్ జార్జ్ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, సెప్టెంబర్ 2 : కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ)కు చెందిన విద్యార్థులు ట్రెక్కింగ్ సెలక్షన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి క్యాంపులకు ఎంపికయ్యారు. ఇటీవల ఎస్ఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన ట్రెక్కింగ్ నేషనల్ క్యాంపులో పాల్గొన్న పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సాయి సిద్దార్థరెడ్డి సత్తాచాటి ప్రథ